సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 1 । జూలై । 2025

వరాహావతారంలో జగన్నాథుడు

డాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆలయ ఈవో బండారు ప్రసాద్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం స్వామి నృసింహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



కళాశాలలకు సర్టిఫికెట్లు నో



డిగ్రీ, పీజీ కాలేజీలకు ఏయూ మార్క్ ట్రీట్‌మెంట్
ఫీజులన్నీ చెల్లించి సీడీసీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తేవాలని హుకుం

- కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటున్న ఉన్నత విద్యాశాఖ
- లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరిక
- ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయని ప్రభుత్వం
- నలిగిపోతున్న కాలేజీ యాజమాన్యాలు

అనకాపల్లిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం ఆంధ్రా యూనివర్సిటీలో సంప్రదించింది. ఫీజులన్నీ చెల్లించి కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకుంటే ఇస్తామని ఏయూ అధికారులు తెగేసి చెప్పారు. చేసేదేమీ లేక ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోయినప్పటికీ కాలేజీ యాజమాన్యం ఫీజులు చెల్లించాల్సి వచ్చింది.

నగరంలోని మరో డిగ్రీ కాలేజీది ఇదే పరిస్థితి. ఏయూ నుంచి సర్టిఫికెట్లు రావాలంటే యాజమాన్యం డబ్బులు కట్టాల్సిందేనని వర్సిటీ అధికారులు చెప్పారు. ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో ఫీజులు కట్టలేమని విద్యార్థులు స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించకుండా సర్టిఫికెట్లు ఇవ్వడం తమ వల్ల కాదని కాలేజీ యాజమాన్యం స్పష్టం చేయడంతో కొద్ది మంది విద్యార్థులు అప్పులు చేసి మరీ తెచ్చి కట్టారు.

ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని 335కి పైగా డిగ్రీ, పీజీ కాలేజీల్లో ఇదే పరిస్థితి ఉంది. ఒకవైపు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. సర్టిఫికెట్లు కావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని యూనివర్సిటీ యంత్రాంగం తేల్చి చెబుతోంది. మరోవైపు ఫీజులు చెల్లించలేదన్న కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ ఉన్నత విద్యాశాఖ హెచ్చరికలు జారీచేస్తోంది. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని ఏయూ తెగేసి చెబుతుంటే పట్టించుకోని ఉన్నత విద్యాశాఖ... తమ విషయంలో మాత్రం కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగడం దారుణమని కాలేజీ యాజమాన్యాలు వాపోతున్నాయి. **- సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం**

నో డ్యూ సర్టిఫికెట్ ఉంటేనే...!

వాస్తవానికి ఏయూ నుంచి గుర్తింపు పొందిన డిగ్రీ, పీజీ కాలేజీలు 335కి పైగా ఉన్నాయి. ఈ కాలేజీల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులను అభ్యసిస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. మరోవైపు ఏయూకి అనుబంధంగా ఉన్న కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్ల కోసం సంప్రదిస్తే.. అన్ని రకాల ఫీజులు చెల్లించి కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకుంటేనే ఇస్తామని ఏయూ యంత్రాంగం స్పష్టం చేస్తోంది. గత 7–8 నెలలుగా ఆంధ్రా యూనివర్సిటీ.. డిగ్రీ, పీజీ కాలేజీలకు సర్టిఫికెట్లను జారీ చేయడం లేదు. మరోవైపు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ ఉన్నత విద్యాశాఖ హెచ్చరికలు జారీచేస్తోంది. ఏయూ అధికారులు మాత్రం తమకు చెల్లించాల్సిన ఫీజులన్నీ క్లియర్ చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసి చెబుతుండటంతో కాలేజీ యాజమాన్యాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరోవైపు కాలేజీలకు సర్టిఫికెట్ల జారీలోనూ మామూళ్ల కోసం సీడీసీ సిబ్బంది ముప్పతిప్పలు పెడుతున్నారని విమర్శలున్నాయి.

గతంలో ఠంచనుగా...!

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో క్యాలెండర్ ప్రకటించి మరీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు జరిగేవి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమయ్యేవి. అనంతరం విద్యార్థులు కాలేజీలకు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. 'గత ప్రభుత్వంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వేస్తుండటంతో వారు చెల్లించడం లేదు. అందుకే మేం వచ్చాక నేరుగా కాలేజీ అకౌంట్లలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు జమ చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు వాగ్దానాలిచ్చారు. గెలిచిన తర్వాత ఏడాది కాలంగా మాకు బకాయిలు చెల్లించడం లేదు' అని నగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాని 'సాక్షి' వద్ద వాపోయారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా తప్పు చేస్తూ.. తమపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించడం దారుణంగా ఉందని మండిపడ్డారు.

5న వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 5వ తేదీన ఉదయం 9.30 గంటలకు వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ–మోసాలు గ్యారెంటీ' పేరిట కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడతామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ విధంగా ఎగనామం పెడుతుందో ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ సమావేశానికి పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సమన్వయ కర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ కుమార్, చింతలపూడి వెంకట రామయ్య, డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచందర్, పోతిన శ్రీనివాసరావు, మహంతి, పార్టీ ముఖ్య నాయుకులు కోలా గురువులు, ఉరుకూటి అప్పారావు, పివిఎస్ఎన్ రాజు (వుడా రవి), డాక్టర్ సిఎంఎ జహీర్ అహ్మద్, బాణాల శ్రీనివాసరావు, గొలగాని శ్రీనివాస్, నడింపల్లి కృష్ణంరాజు, జి.శ్రీనివాస్, మువ్వల సురేష్, ద్రోణంరాజు శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి అమల్లోకి పెరిగిన రైలు చార్జీలు



తాటిచెట్లపాలెం: సామాన్య, మధ్య తరగతి ప్రయాణికుల ప్రధాన రవాణా సాధనం రైలు. ఇతర ప్రయాణ సాధనాలతో పోల్చుకుంటే తక్కువ చార్జీలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో రైల్వే కీలకం. రైల్వే చార్జీలు స్వల్పంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పెంచిన చార్జీలు నేటి(జూలై 1) నుంచి అమల్లోకి రానున్నాయి. సబర్బన్(సింగిల్ జర్నీ), సీజన్ టికెట్స్(సబర్బన్, నాన్ సబర్బన్), రిజర్వేషన్ చార్జీలు, సూపర్‌ఫాస్ట్ చార్జీలు, ఇతర చార్జీల్లో ఎలాంటి మార్పుల్లేవు.

ఆర్డినరీ నాన్ ఏసీ(నాన్–సబర్బన్)
సెకండ్ క్లాస్ మొదటి 500 కి.మీ.లకు మార్పు లేదు. ఆపై కి.మీ.కు 0.5(అర) పైసా చొప్పున పెంచారు. 501 నుంచి 1500 కి.మీ. వరకు రూ.5, 1501 నుంచి 2500 కి.మీ. రూ.10, 2501 నుంచి 5 వేల కి.మీ. వరకు రూ.15 చొప్పున చార్జీలు పెరగనున్నాయి. స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్‌కు కి.మీ.కు అర పైసా చొప్పునే పెరుగుదల ఉంది.

మెయిల్ ఎక్స్‌ప్రెస్(నాన్–ఏసీ): సెకండ్ క్లాస్, స్లీప్ క్లాస్, ఫస్ట్ క్లాస్ కేటగిరీలో కిలో మీటర్‌కు పైసా చొప్పున చార్జీలలు పెరిగాయి.

ఏసీ క్లాస్‌లు: ఏసీ చైర్‌కార్, 3 టైర్, 2 టైర్, ఫస్ట్ క్లాస్/ఈసీ/ఈఏ కిలో మీటర్‌కు 2 పైసలు చొప్పున పెంచిన చార్జీలు అమల్లోకి రానున్నాయి.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించండి



జీవీఎంసీ కమిషనర్‌కు అప్పన్న చిత్రపటం అందజేస్తున్న ఈవో త్రినాథరావు

దాబాగార్డెన్స్: ఈ నెల 9న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు అభ్యర్థించారు. జీవీఎంసీ కమిషనర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, బీచ్‌లో స్నానపు గదులు, మరుగుదొడ్లు, రోడ్ల అభివృద్ధి వంటి ఏర్పాట్లు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి ప్రసాదం, చందనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్, అర్చకులు పాల్గొన్నారు.

డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా పద్మావతి బాధ్యతల స్వీకరణ



దాబాగార్డెన్స్ : జిల్లా ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా కె.పద్మావతి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రయాణికులకు జిల్లాలో మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది, అసోసియేషన్ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

తండ్రి బాటలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పీఠంపై..

- ఒక్క నామినేషనే దాఖలు కావడంతో మాధవ్ ఎన్నిక లాంఛనమే..
- తండ్రి పీవీ చలపతిరావు బీజేపీ కురువృద్ధుల్లో ఒకరు



ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పోకల వంశీ నాగేంద్ర మాధవ్ (పీవీఎన్ మాధవ్) నియామకం దాదాపు ఖరారైంది. కొన్ని రోజులుగా అధ్యక్ష పదవిపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర బీజేపీ ముఖ్య నాయకులతో పాటు కేంద్ర పెద్దల మద్దతు పీవీఎన్ మాధవ్‌కు పుష్కలంగా ఉండటంతో ఆయన ఎన్నిక లాంఛనంగా మారింది. రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నికలకు సంబంధించి సోమవారం ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడమే ఇందుకు స్పష్టమైన నిదర్శనం. పార్టీ ఎన్నికల పరిశీలకుడు పీసీ మోహన్, ఎన్నికల అధికారి పాక వెంకట సత్యనారాయణలకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో పాటు విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు మాధవ్ నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనం కాగా, మంగళవారం అధికారిక ప్రకటన వెలువడనుంది.

తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకొని...
పీవీఎన్ మాధవ్.. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచిన దివంగత పీవీ చలపతిరావు తనయుడు. బీజేపీ ఆవిర్భవించిన తొలినాళ్లలో పీవీ చలపతిరావు రాష్ట్ర పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకరుగా విశేష సేవలందించారు. ఆంధ్ర ఉద్యమంతో పాటు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1945లోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి, 1974, 1980లో ఎమ్మెల్సీగా సేవలు అందించి 87వ ఏట మరణించారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పీవీఎన్ మాధవ్, తండ్రి బాటలోనే పయనించి ఆర్‌ఎస్‌ఎస్‌లో సభ్యుడయ్యారు. తొలి నుంచి బీజేపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. విశాఖలో అనేక బీజేపీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి అగ్ర నాయకుల మన్ననలు అందుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేవైఎంలో (భారతీయ జనతా యువ మోర్చా) పలు కీలక పదవులు నిర్వహించారు. 2017లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై పార్టీకి విలువైన సేవలు అందించారు. శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గత కొన్నేళ్లుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఎన్నిక దాదాపు ఖరారైనందున విశాఖలోని బీజేపీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మనవడిని అమ్మేసిన తాత

తాటిచెట్లపాలెం: కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడం ఇష్టం లేని తండ్రి, తన కుమార్తెకు పుట్టిన మగ బిడ్డను ఆమెకు తెలియకుండానే దత్తత ఇచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు నేరుగా పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. అరకు ప్రాంతానికి చెందిన పెట్టెల దివ్య (23) అదే ప్రాంతానికి చెందిన జాన్‌బాబును ప్రేమించి వివాహం చేసుకుంది. దివ్య తండ్రి పి. శుక్రకు ఈ వివాహం మొదటి నుంచి ఇష్టం లేదు. వారిద్దరినీ విడదీయడానికి అతను పలు ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలో దివ్య, జాన్‌బాబు మధ్య మనస్పర్థలు రావడంతో వారు విడివిడిగా ఉంటున్నారు. ఈ సమయంలో దివ్య గర్భవతి కావడంతో, ప్రసవం కోసం ఆమె తండ్రి శుక్ర విశాఖలోని కైలాసపురం ప్రాంతానికి తీసుకువచ్చి, అద్దె ఇంట్లో ఉంచాడు. దివ్యకు కేజీహెచ్‌లో మగబిడ్డ జన్మించాడు. బిడ్డకు పచ్చకామెర్లు ఉన్నాయని, అనారోగ్యంగా ఉన్నాడని, వైద్యం చేయించాలని చెప్పి, దివ్యతో పలు పత్రాలపై సంతకాలు చేయించాడు. అనంతరం తల్లికి తెలియకుండా ఆ బిడ్డను దత్తత పేరుతో విక్రయించాడు. రెండు నెలలు గడిచినా బిడ్డ ఆచూకీ తెలియకపోవడంతో దివ్య తన తండ్రిని నిలదీసింది. సరైన సమాధానం రాకపోవడంతో, దివ్య మొదట కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో, ఆపై నేరుగా పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. కమిషనర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి బిడ్డ ఆచూకీని కనుగొన్నాయి. బిడ్డను మొదట ఆర్‌అండ్‌బీ వద్ద గల శిశుగృహకు అప్పగించారు. సోమవారం పోలీసుల సమక్షంలో ఆ బిడ్డను తల్లిదండ్రులైన దివ్య, జాన్‌బాబులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



కన్నబిడ్డతో తల్లితండ్రులు జాన్‌బాబు, దివ్య

టీసీలకు డబ్బు వసూలుపై విచారణ

అరిలోవ: ఇటీవల రిలీవ్ అవుతున్న విద్యార్థుల నుంచి టీసీల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని గురుకులాల జిల్లా ఇన్‌చార్జి సమన్వయాధికారి ఎస్. రామకృష్ణ సోమవారం సందర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. టీసీల కోసం డబ్బులు అడిగిన విషయం నిజమేనని కొందరు విద్యార్థులు ధ్రువీకరించారు. దీంతో ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడిన ఆయన, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని మందలించారు. పదో తరగతి పూర్తై రిలీవ్ అయిన విద్యార్థులందరికీ టీసీలను వెంటనే సిద్ధం చేయించారు. ఏ విద్యార్థి వచ్చినా టీసీ ఇవ్వాలని ప్రిన్సిపాల్ రత్నవల్లిని ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీసీల కోసం డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై పూర్తి నిజానిజాలు తెలుసుకుని గురుకులాల కార్యదర్శికి నివేదిక అందజేస్తామని రామకృష్ణ తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల పడిగాపులు

- ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ సాయంత్రానికి..
- కూటమి నేతల సిఫార్సుల కారణంగానే ఆలస్యం
- ఉద్యోగుల ఆగ్రహం, ఆందోళన



డీపీవో కార్యాలయం ఎదుట డిజిటల్ అసిస్టెంట్ల పాట్లు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పంచాయతీరాజ్ డిజిటల్ అసిస్టెంట్ల (గ్రేడ్-6) బదిలీల కౌన్సెలింగ్ సోమవారం తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఉదయం 9 గంటల నుంచి డీపీవో కార్యాలయం వద్దకు డిజిటల్ అసిస్టెంట్లు చేరుకున్నారు. 11 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా సాయంత్రం 6 గంటలకు ప్రక్రియ ప్రారంభించారు. భోజనం లేకుండా పడిగాపులు కాయడంతో ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన సిఫార్సు లేఖలే బదిలీల కౌన్సెలింగ్ జాప్యానికి కారణమని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు కోరిన పోస్టింగ్‌లు, ఇతర వ్యవహారాలపై అధికారులు సాయంత్రం వరకు చర్చలు జరపడం వల్ల కౌన్సెలింగ్ ఆలస్యమైంది. పోస్టుల ఖాళీల జాబితాను బయట పెట్టకుండానే కౌన్సెలింగ్ చేపట్ట డంపై పారదర్శకత లేదని అసిస్టెంట్లు ఆరోపించారు.

పైరవీలకు పెద్దపీట?
మొత్తం 549 మంది డిజిటల్ అసిస్టెంట్లలో 95 శాతం మంది ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారే. స్థానచలనం తప్పదని తెలియడంతో, తమకు నచ్చిన స్థానాల కోసం పోటీ పడ్డారు. డీపీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొదట దివ్యాంగులు, స్పౌజ్, అనారోగ్యంతో ఉన్నవారికి పోస్టింగ్‌లు కేటాయించారు. ఆ తర్వాత కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే జనరల్ బదిలీలు జరిగాయని ఆరోపణలు వినిపించాయి. బదిలీల్లో పైరవీలకు పెద్దపీట వేశారని ఆరోపణలు రావడంతో, కొందరు అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేస్తూ, తమకు సరైన పోస్టింగ్ కావాలని డిమాండ్ చేశారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీలపై విమర్శలు
మధురవాడ: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో శని, సోమవారాల్లో జరిగిన సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీల కౌన్సెలింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కౌన్సెలింగ్‌లో కూటమి ఎమ్మెల్యేలు, నాయకుల సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చారని పలువురు ఆరోపించారు. ప్రిఫరెన్షియల్ కేటగిరి, సీనియారిటీ, కోర్టు మార్గదర్శకాలను పక్కన పెట్టి, అస్తవ్యస్తంగా బదిలీలు చేశారని ఉద్యోగులు వాపోతున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఐదేళ్లు నిండని, శారీరక సవాళ్లు ఎదుర్కొంటున్న ఉద్యోగులను కూడా కౌన్సెలింగ్‌కు పిలిచి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరగనివారు కోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

గాల్లో ఎగురుతూ.. అలలపై దూకుతూ..



విశాఖ సాగర తీరం మరోసారి యువ శక్తికి వేదికైంది. సోమవారం మత్స్యకార యువకులు చూపిన సాహసాలు చూపరులను అబ్బురపరిచాయి. ఉవ్వెత్తున ఎగిసి పడే అలలతో పోటీపడుతూ, యువకులు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలల ధాటికి దీటుగా గాల్లోకి ఎగురుతూ, ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో అబ్బురపరిచారు. కేవలం నీటిలోనే కాదు, ఇసుక తిన్నెలపై కూడా యువత తమ సాహసాలను ప్రదర్శించారు. ఈ దృశ్యాలు సాగర తీరానికి వచ్చిన పర్యాటకులందరినీ 'వావ్' అనిపించాయి.

– ఫొటోలు : సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల గృహిణులు వివరాలకు 80193 88999 ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నుంచి మళ్ల ధనలత సస్పెన్షన్

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీ 60వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు మళ్ల ధనలతను సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. స్థానికంగా పార్టీకి నష్టం కలిగించే చర్యలు తీసుకుంటున్నారని విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ అందించిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేశారు.






35 మంది ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన ఉద్యోగిని సత్కరిస్తున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం: జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న 35 మంది సూపర్‌వైజర్లు, సిబ్బంది సోమవారం పదవీ విరమణ చేశారు. విశాఖ డిపోలో సోమవారం నిర్వహించిన పదవీ విరమణ సత్కార కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖ స్టీల్ సిటీ, గాజువాక, మధురవాడ డిపోల కార్మికులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, వారికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వినతులను పరిష్కరించాలి

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ ప్రజా దర్బార్‌కు వచ్చే వినతులు, భూ సంబంధిత ఫిర్యాదులను నిశితంగా పరిశీలన చేసి న్యాయబద్ధంగా ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 11 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించాలని చైర్మన్, కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన గణాంక అధికారి హరిప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



గంజాయి కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ సోమవారం ఇద్దరు నిందితులకు జైలు శిక్షలు విధించారు. వివరాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ వెల్లడించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం రాయవరం నివాసి అయిన నల్ల తేజోమూర్తి (45), 2019 ఫిబ్రవరిలో యలమంచిలి వద్ద ఒక వ్యాన్‌లో 200 కేజీల గంజాయిని రవాణా చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ నేరానికి గాను కోర్టు అతనికి 14 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 1.40 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం, రావాలపల్లికి చెందిన దేవర శివ (28) అనే ట్రాక్టర్ డ్రైవర్, 2017 ఫిబ్రవరిలో కొయ్యూరు వద్ద 96 కేజీల గంజాయితో పట్టుబడ్డాడు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించే ప్రయత్నంలో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు అతనికి 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 1.20 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాలి. ఈ రెండు కేసుల్లోనూ నిందితులు గంజాయి రవాణాలో పట్టుబడగా, వారి నేరాలు రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్షలు ఖరారు చేశారు.

